క్లుప్తంగా

10న ముక్కోటి ఏకాదశి వేడుకలు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ధర్మకర్త మోహన్‌రెడ్డి

డోన్: మండలంలోని ఆవులదొడ్డి గ్రామంలో వెలసిన వనం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీ ముక్కోటి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త ఆలా మోహన్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు డోన్‌లో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. 10వ తేదీ ఉదయం నుంచి డోన్ పాతబస్టాండ్ నుంచి ఆవులదొడ్డి గ్రామం వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు.

బేకరి దుకాణాల తనిఖీ



కేకల నాణ్యతను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

కోవెలకుంట్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్‌లో ఉన్న పలు బేకరీ షాపులను శనివారం నంద్యాల జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ఖాసిం తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో విక్రయిస్తున్న వివిధ రకాల కేక్‌లు, జామ్‌లు, దిల్‌పసంద్, తదితర కేక్‌లను పరిశీలించారు. వాటన్నింటి శాంపిల్స్ సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్ పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతలేని కేక్‌లు, ఇతర తినుబండారాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు



దుకాణం వద్ద ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్

కొలిమిగుండ్ల: ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నారు. శనివారం కొలిమిగుండ్లలో వాణిజ్య విద్యుత్ కనెక్షన్‌లతో పాటు తాగునీటి పథకాలు, వీధిలైట్లకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేశారు. మీటర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు రీడింగ్ నమోదు చేసి బిల్ తీయనున్నారు. తర్వాత ప్రీపెయిడ్ పద్ధతి అమల్లోకి రానుంది. సాధారణ మీటర్ల కంటే స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు అధికంగా వస్తాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. దశల వారీగా అన్ని రకాల కేటగిరీలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నారు.

రోడ్డుపై చెత్తకుప్పల తొలగింపు



ఆకుమల్లలో చెత్తను తొలగిస్తున్న జేసీబీ

సాక్షి ఎఫెక్ట్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల ప్రధాన రహదారిపై ఉన్న చెత్తకుప్పలను శనివారం తొలగించారు. డిసెంబర్ 29న సాక్షిలో వీధులు బురదమయం అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి వీధుల్లో ఉన్న బురద, చెత్తకుప్పలను జేసీబీతో తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ జాబితాలో ఇతరులను చేర్చొద్దు

డోన్ టౌన్: ఇతర కులాలను ఎస్సీ జాబితాలో చేర్చవద్దని ఎమ్మార్పీఎస్ నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి కేశవయ్య విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల చేపట్టిన కుల గణనలో మాదాసీ కురవ, మాదారి కురబలను ఎస్సీలుగా నమోదు చేయడం సరి కాదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: స్థానిక జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.భారతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. యూజీసీ నెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటాతో ఈ నెల 6వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక కళాశాలలో హాజరు కావాలన్నారు.

శాస్త్రవేత్తలను స్మరించుకుందాం

డోన్ టౌన్: శాస్త్రవేత్తలను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులు అన్నారు. స్థానిక పాఠశాలలో శనివారం శాస్త్రవేత్తలు సర్ ఐజాక్ న్యూటన్, లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

చలికాలం.. జరభద్రం

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- వణికిస్తున్న చలి
- వ్యాధులు ప్రబలే అవకాశం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



మంచు ప్రభావానికి లైట్లు వేసుకొని వస్తున్న వాహనాలు

అవుకు: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. దీంతో చలి పంజా విసురుతోంది. వేకువజామున దట్టమైన పొగమంచు కమ్ముతోంది. స్వెటర్లు వేసుకున్నా, మంకీ క్యాపులు పెట్టుకున్నా చలి తీవ్రతకు వణకాల్సిందే. నియోజకవర్గంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 18 నుంచి 19 డిగ్రీలు కాగా.. గరిష్ట ఉష్ణోగ్రతలు 26 నుంచి 29 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లేవారు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వయోవృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

చల్లని గాలులు వీస్తుండడంతో ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసి ఉంటోంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, రోజువారీ కూలి పనులకు వెళ్లేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. పొగమంచు ఉండడం వల్ల రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించవు. ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. అదేవిధంగా ఆరోగ్య విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ఉదయాన్నే వాకింగ్, జాగింగ్ చేసేవారు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోకుంటే జబ్బుల బారిన పడాల్సి ఉంటుంది. వీలైనంత వరకు వేకువజాము ప్రయాణాలు మానుకోవడం మంచిది. ఒకవేళ తప్పనిసరి అనుకుంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆస్మా ఉన్నవారు శీతాకాలంలో వాకింగ్‌కు వెళ్లకపోవడమే మంచిది. చలి తీవ్రత పెరిగే కొద్ది శ్వాసకోస వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున ఉదయాన్నే బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. అంతేకాకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో, పరిసరాల పరిశుభ్రత అంతే ముఖ్యం. చలికాలంలో ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రంగా లేకుంటే ఇళ్లలో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. దోమ కుడితే టైఫాయిడ్, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు లాంటి విష జ్వరాలు వచ్చే అవకాశాలుంటాయి. తాగునీటి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం శ్రేయస్కరమని, వేడివేడి ఆహార పదార్థాలనే తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే వంట పాత్రలపై విధిగా మూతలు పెట్టాలని, దోమ తెరలు వాడాలని సూచిస్తున్నారు.

ఉన్ని దుస్తులతో రక్ష

చలి పెరగడంతో ఉన్ని దుస్తులు ధరించడం వల్ల చలి నుంచి ఉపశమనం పొందవచ్చు. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు, జ్వరం, దగ్గు సమస్యలున్న వారు వెచ్చని వాతావరణంలో ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉంది. దీనికి అనుగుణంగా ఉండే ఉన్ని దుస్తులను వాడాలి. వృద్ధులు, చిన్నారులతో పాటు అన్ని వయస్కుల వారు తమకు అనుగుణంగా స్వెటర్లు, జర్కిన్లు, మంకీ క్యాప్‌లు ధరించటం మే లు. శీతలపానియాలు,ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉంటూ బయటకు వెళ్లినప్పుడు చెవుల్లోకి దూది పెట్టుకుని వెళ్లడం మంచిదని వైద్యులు తెలిపారు.

జాగ్రత్తలు అవసరం



చలి కాలంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. ఈ సీజన్‌లో ముఖ్యంగా జలుబు, జ్వరం, ఫ్లూ వంటివి వ్యాపించే ప్రమాదముంది. జాగ్రత్తలు పాటించకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవు. అందువల్ల ప్రతి ఒక్కరూ శీతాకాలం ముగిసే వరకు ఉన్ని దుస్తులు ధరించడం, వేడినీరు, ఆహారం తీసుకోవడం మంచిది. వ్యాధుల బారిన పడితే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకోవాలి.

–డాక్టర్ అభినయ్, అవుకు సీహెచ్‌సీ సూపరింటెండెంట్

ముళ్లపొదల తొలగింపు



పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కొండపేట అవుకుమెట్ట వద్ద హిందూ శ్మశాన వాటికలో ముళ్లపొదలను శనివారం తొలగించారు. పంచాయతీ ఈఓ, మండల ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తొలగింపు పనులు చేపట్టారు.

నాటుసారా స్వాధీనం.. మహిళ అరెస్టు

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేట చాకిరేవు మిట్ట వద్ద నాటుసారా విక్రయిస్తున్న అంపమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఇంతియాజ్‌బాషా శనివారం తెలిపారు. ఆమె వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.





ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు, శ్రీనివాసుని కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కల్యాణం.. కమనీయం

డోన్: పట్టణంలోని పాతపేట రామాలయంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా శనివారం శ్రీనివాస కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, పద్మజ దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు ప్రసాద వితరణతో పాటు అన్నదానం చేశారు.

ఘనంగా బ్రెయిలీ దినోత్సవం



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్రామిరెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, ప్రాథమిక పాఠశాల స్పెషల్‌స్కూల్ హెచ్‌ఎం రాణి చెన్నమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రెయిలీ గొప్పతనాన్ని ప్రత్యేక అవసరాల పిల్లలు, వారి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో భవితసెంటర్ ఉపాధ్యాయురాలు ప్రేమకుమారి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

బేతంచెర్ల: ఆర్యవైశ్యులు సమాజ సేవలో పాలుపంచుకుని ఆదర్శంగా నిలవాలని వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ సుబ్బరామయ్య, వనితా క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గుండా నాగ సుప్రజ అన్నారు. పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా అనుముల సుధీర్, కార్యదర్శిగా రమణ, కోశాధికారిగా మధుసురేంద్ర, అలాగే వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఇందుమతి, శ్రీవిద్య, కోశాధికారిగా శ్రీరామ నాగమణి, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు భవనాసి నాగేష్, గౌరవ అధ్యక్షుడు శ్యామ్ సుందర్ లాల్, సేవాదల్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్, వాసవీ క్లబ్ సభ్యులు మోహన్‌రావు, గుప్త, విజయలక్ష్మీ, గుండాగోపాల్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గోవా మద్యం సీజ్

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కైప గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని సీజ్ చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. కైప గ్రామానికి చెందిన తలారి కృష్ణయ్య, క్రిష్ణగిరి మండలం కోయిలకొండ గ్రామానికి చెందిన ఈడిగ చెన్నకృష్ణగౌడ్, డోన్‌కు చెందిన కేశవగౌడ్ కారులో గోవాకు చెందిన 295 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా సమాచారం మేరకు దాడి చేశారు. కారును తనిఖీ చేయగా మద్యం ఉన్నట్లు గుర్తించారు. కారు సహా మద్యం బాటిళ్లను సీజ్ చేసి ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



డోన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రామనర్సప్ప



బేతంచెర్ల మోడల్ స్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



కొలిమిగుండ్ల: మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

డోన్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ–2 రామనర్సప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, పాతపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి, కౌన్సిలర్ సుంకయ్య పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలోని మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపాల్ మరియదాసు ప్రారంభించారు. ఏజెన్సీ నిర్వాహకులు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం తయారు చేయాలని సూచించారు.

సమయాన్ని వృథా చేసుకోవద్దు

కొలిమిగుండ్ల: విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని ఎంపీడీఓ సాయికృష్ణ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులుతో కలిసి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలా మంది విద్యార్థులు ఎక్కువ భాగం సెల్‌ఫోన్‌కే సమయం కేటాయిస్తున్నారని అన్నారు. కళాశాలలో క్వాలిఫైడ్ లెక్చరర్లు ఉన్నారని, వారి సేవలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఏఓ ప్రసాదరెడ్డి, హెచ్‌ఎం హుశేనయ్య, లెక్చరర్లు శ్రీనివాసులరెడ్డి, బాల ఓబన్న పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. త్వరలో మంచి రోజులు





ఆంజనేయస్వామి గుడి పూజారిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి బుగ్గన, మాజీ మంత్రి బుగ్గనను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నేతలకు మాజీ మంత్రి బుగ్గన భరోసా
- పథకాల అమల్లో టీడీపీ విఫలమైందని విమర్శ

డోన్: ఎన్నికల సమయంలో ప్రజలు ఏదో ఆశించి టీడీపీ కూటమిని అధికారంలోకి తెచ్చి భంగపడ్డారని రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం డోన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలతో పాటు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను ఆయన పరామర్శించారు. అధికారం లేదని ఎవరూ నిరాశ చెందవద్దని.. త్వరలో మంచి రోజులు వస్తాయని ధైర్యం చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన టీడీపీకి వచ్చే ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని జోస్యం చెప్పారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. అక్రమ కేసులకు ఏ ఒక్కరూ భయపడవద్దని, పార్టీ అందరికీ అండగా ఉంటుందని హామీనిచ్చారు. పట్టణంలోని ఇందిరానగర్ ఆంజనేయస్వామి పూజారి విజయ్‌కుమార్‌శర్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆలా శివలింగారెడ్డి, రైల్వే శ్రీను, చాటకొండ నరసింహయ్య, ప్రింటింగ్ ప్రెస్ క్రిష్టారెడ్డి కుటుంబాలను పరామర్శించారు.

మళ్లీ జగనన్నే రావాలి

బుగ్గన ఆత్మీయ పర్యటన సందర్భంగా కర్నూలు రైల్వేగేట్ సీఎస్ఐ చర్చి వద్ద సీతమ్మ అనే వృద్ధురాలితో మాట్లాడారు. రాష్ట్రంలోనే డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దిన మీరు ఓటమి చెందారంటే నమ్మశక్యంగా లేదని వృద్ధురాలు కన్నీటి పర్యంతమయ్యారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశీర్వదించారు. ఆయన వెంట మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ సోమేష్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, పార్టీ నాయకులు మల్యాల భాస్కర్‌రెడ్డి, యాపదిన్నె నరసింహారెడ్డి, ఎద్దుపెంట క్రిష్టారెడ్డి, నాగభూషణంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండపేట క్రిష్టారెడ్డి ఉన్నారు.

కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు

పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పార్టీ వలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షునిగా పోస్టుపసాద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లెంపల్లె రామచంద్రుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కురుకుంద హరిని ఇటీవల పార్టీ అధిష్టానం నియమించింది. తమకు పదవులు రావడానికి కృషి చేసిన బుగ్గనను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

డైరీ ఆవిష్కరణ

డోన్ డివిజన్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 2025 డైరీని బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తన స్వగృహంలో ఆవిష్కరించారు. జేఏసీ అధ్యక్షుడు ఆదాం, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, జనరల్ సెక్రటరీ జాన్సన్‌బాబు, జాయింట్ సెక్రటరీ ప్రశాంత్‌రాజ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు రైల్వే నాగేంద్ర, సాధిక్, పాస్టర్లు నిత్యానందం, దైవసహాయం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్యాపిలి: మండల పరిధిలోని యర్రగుంట్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామసుబ్బారెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పరామర్శించారు. రామసుబ్బారెడ్డి కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. ఆయన భార్య రామేశ్వరి, కుమారుడు కృపాసాగర్‌ను బుగ్గన పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పోదొడ్డి కృష్ణమూర్తి, కమతం భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజా మురళీకృష్ణ, బోరెడ్డి రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బోరెడ్డి రఘు, మస్తాన్, కొండయ్య, మహిధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



సావిత్రీబాయి పూలే, ఫాతిమా షేక్ చిత్రపటాలకు నివాళులు

డోన్ టౌన్: సావిత్రీబాయి పూలే, ఫాతిమా షేక్‌లను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మమత, రైల్వే ఎస్ఐ బిందుమాదవి అన్నారు. పూలే, ఫాతిమా జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల విద్య కోసం పూలే ఎంతో శ్రమించారని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న హెచ్‌ఎం తొగట సురేష్‌బాబుతో పాటు పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్, హెచ్‌ఎం మైమున్నీసా, భరత్‌కుమార్, నంది విజయలక్ష్మీ పాల్గొన్నారు. అలాగే జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగమణిని సత్కరించారు.

విద్యారంగ సమస్యలపై వినతి



పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ

కోవెలకుంట్ల: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి విన్నవించారు. శనివారం మంత్రి బీసీ కోవెలకుంట్లకు రాగా రాష్ట్రోపాధ్యాయ, రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ సంఘం నాయకులు జీవీఎస్ ప్రసాదరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, అజాంబేగ్, ఆర్‌జేయూపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజ్ వీరబ్రహ్మం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ కలిశారు. ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని, సంక్రాంతి కానుకగా డీఏ ప్ర కటించాలని, 12వ పీఆర్‌సీని నియమించాలని కోరా రు. సంజామల మండలం ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని మంజూరు చేయించాలని, కోవెలకుంట్ల మండలాన్ని డోన్ విద్యా డివిజన్ నుంచి నంద్యాల డివిజన్‌కు మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఎస్టీయూ రూపొందించిన స్టడీ మెటీరియల్, నూతన సంవత్సర క్యాలెండర్లను మంత్రి ఆవిష్కరించారు. ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు గిరీష్, ఎంవీ సుబ్బారెడ్డి, విజయుడు తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం



గాలి ఓబయ్య మృతదేహం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని యాగంటిపల్లె రహదారిలో ఉన్న ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వలో గల్లంతైన గాలి ఓబయ్య(85)మృతదేహం శనివారం లభించింది. మృతుడు కొన్నేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపం చెంది శుక్రవారం ఎస్ఆర్‌బీసీ కాలులో దూకి గల్లంతయ్యాడు. రాళ్లకొత్తూరు సమీపంలోని దెయ్యలకుంట వద్ద మృతదేహం లభించడంతో పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా కమ్యునిటీ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న జడ్జి

డోన్ టౌన్: వివిధ రంగాల్లో శిక్షణ పొందిన మహిళలు ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకుని ఆర్థిక స్వాలంబన సాధించాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. స్థానిక ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శనివారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ఉపాధి కోసం ప్రభుత్వాలు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మినిస్ట్రీస్ ఆఫ్ టెక్స్‌టైల్స్, ఏపీ ప్రొడక్టివ్ కౌన్సిల్ సంయుక్తంగా నైపుణ్య శిక్షణ ఇచ్చినట్లు ఫోటాన్ అధినేత సాయినాథ్ తెలిపారు.